కథ

శశిరేఖా పరిణయం

ఆరేళ్ల మా వైవాహిక జీవితంలో సుమతికీ, నాకూ మధ్య యింత తీవ్ర స్థాయిలో అభిప్రాయ భేదాలు రావటం యిదే మొదటి సారి.

ఈ మనస్పర్థలకు మూల కారణం మూడో వ్యక్తి కావటం నన్ను మరీ బాధించే విషయం! ఇంత గొడవకు కారణమైన ఆ వ్యక్తి శశిరేఖ! సుమతికి స్వయాన చెల్లెలు, నాకు మరదలు!



—ఇ.టి.రామారావు

ఓ ఆదివారం హైదరా బాద్ నుండి మా యింటికి వచ్చింది శశిరేఖ. అక్కడ ఒక జాతీయ బ్యాంకులో క్లర్కుగా పనిచేస్తున్నది ఆమె.

"ఏమిటే! ఉత్తరం కూడా వ్రాయకుండా యింత హఠాత్తుగా వూడి పడ్డావు?" చెల్లెలిని చూస్తూనే ఆశ్చర్యంగా ప్రశ్నించింది సుమతి.

"ఏం రాకూడదా? ఉత్తరం వ్రాసి పర్మిషన్ తీసుకొని మరీ రావాలా ఏమిటే? పింకీని చూడాలనిపించి రెండ్రోజులు సెలవు పెట్టి వచ్చేశాను." అన్నది.

మా పాప పింకీ అంటేశశిరేఖకు ప్రాణం! పింకీ కూడా అంతే. శశిరేఖను బాగా యిష్ట పడుతుంది! 'పిన్నీ' అంటూ ఆమె వెంటే తిరుగుతూ శశిరేఖ వున్నన్ని రోజులు మమ్మల్ని కూడా పట్టించు కోదు. తనూ కూడా ఒక పసిపాపగా మారిపోయి పింకీతో ఆడుకుంటూ,కబుర్లు, కేరింతలతోయిల్లంతా సందడిగా తయారు చేస్తుంది శశిరేఖ!

అయితే శశిరేఖ యీసారి కేవలం పింకీని చూడటానికే వచ్చిందంటే నా కెందుకో అంత సులభంగా నమ్మ బుద్ధి కావటం లేదు. శశిరేఖ యిలా వస్తున్నట్లు మామగారు ముందుగా వ్రాసి వుండేవారు. అదీ కాకుండా శశిరేఖ ముఖంలో కొత్తగా కనిపిస్తున్న గాంభీర్యం, ఓ విధమైన సీరియస్ నెస్ వాలో ఆ అనుమానాన్ని ప్రబలం చేశాయి.

నా అనుమానం సరైనదేనని ఆ మధ్యాహ్నానికి తెలిసి పోయింది. భోజనాలు పూర్తి చేసి నేను, సుమతి హాల్లో కూర్చుని టివి చూస్తున్నాం. బెడ్ రూంలో పింకీతో కబుర్లు చెబుతూ కాలక్షేపం చేస్తున్నది శశిరేఖ. పింకీ నిద్రపోయాక తనూ హాల్లోకి వచ్చి మా ఎదురుగా కూర్చుంది.

"ఆ టి.వి కాసేపు ఆఫ్ చేస్తే నేనో ముఖ్య విషయం మాట్లాడాలిమీతో." అన్నది మా యిద్దరి వంక చూస్తూ, ఇలాంటి దేదో వుంటుందని నేను ముందుగా వూహించాను కాబట్టి పెద్దగా ఆశ్చర్య పోలేదు.

చెల్లెలి ధోరణికి ఆశ్చర్య పడుతూ లేచివెళ్లి టివి ఆఫ్ చేసి వచ్చి సోఫాలో నా ప్రక్కన కూర్చుంది సుమతి.

"ఏమిటే అంత ముఖ్య విషయం?" శశిరేఖను ప్రశ్నార్థకంగా చూస్తూ అడిగింది సుమతి.

శశిరేఖ ఒక్క క్షణం మాట్లాడ లేదు. తలవంచుకుని అర చేతుల వైపు చూసుకుంటూ ఆ తర్వాత తలెత్తింది.

"అమ్మా నాన్న నాకు సంబంధాలు చూస్తున్నారు. ఆ విషయం మీకూ తెలుసు. వాళ్ల ప్రయత్నాలు మానుకోమని మీరు చెప్పాలి" అన్నది మెల్లగా.

"ఏం? పెళ్లి చేసుకోవా?" వెంటనే అడిగింది సుమతి.

"చేసుకుంటాను. అయితే వాళ్లు చూసే వ్యక్తిని కాదు. నేను దివాకర్‌ని ప్రేమించాను. అతడినే చేసుకుంటాను. ఈ విషయం యింట్లో కూడా చెప్పాను. అయితే వాళ్లకది యిష్టం లేదు. అతడితో పెళ్లికి అంగీకరించే ప్రసక్తి లేదని వాళ్ల ప్రయత్నాల్లో వాళ్లు వున్నారు. స్వతంత్రించి నేనో నిర్ణయం తీసుకునే ముందు మీతో ఒక మాట చెబుదామని వచ్చాను." అన్నది.

సుమతి ముఖం కోపంతో ఎరుపెక్కింది. చెల్లెలు యిలా మాట్లాడటం ఆమె సహించ లేకపోతున్నది. నేను సుమతి చెయ్యి మీద చెయ్యి వేసి శాంతించ మన్నట్లు మెల్లిగా నొక్కాను.

"అతడిని వద్దనటానికి మీ అమ్మ నాన్న చెప్పే కారణాలు ఏమిటి శశిరేఖా?" అడిగాను నేను.

"చాలా కారణాలు చెబు తున్నారు. మొదటిది అతను మనకంటే తక్కువ కులం వాడు. ఆస్తి పాస్తులు లేవు. అమ్మా నాన్న అయిన వాళ్లు ఎవరూ లేరు. అనాథ శరణాలయంలో పెరిగి పెద్దయి కొంత మంది దాతల విరాళాలతో, మెరిట్ స్కాలర్ షిప్పులతో చదువుకొని యిప్పుడు మా బ్యాంకి లోనే జాబ్ చేస్తున్నాడు" అన్నది శశిరేఖ.

"అంతే కదా మరి!అమ్మా నాన్న అలా చెప్పటంలో తప్పేముంది? కులం లేని వాడిని ఆస్తి పాస్తులు, అయిన వాళ్లు ఎవరూ లేని ఒక అనామకుడిని అల్లుడిగా చేసుకోవలసిన ఖర్మ వాళ్లకేమిటే? నీ పెళ్లి కోసం దాదాపు లక్ష రూపాయలు దాచి వుండాడు గదే వాన్న! నీ కిలాంటి పాడు బుద్ధి ఎందుకు పుట్టింది?" కోపంగా అడిగింది సుమతి.

ఈ మాటలు శశిరేఖ మనసును గాయపరిచాయని ఆమె ముఖ కవళికలను గమనిస్తున్న నేను వూహించ గలిగాను. కోపాన్ని అతి కష్టం మీద నిగ్రహించు కుంటున్నదని గ్రహించాను. ఎంత అక్క అయినా సుమతి యింత తీవ్రంగా మాట్లాడటం నాకు నచ్చ లేదు.

"ఏమిటి సుమతీ అంత ఆవేశం? ఆమె చెప్పేదిపూర్తిగావినిపించుకోవేం?" అన్నాను.

"ఏమిటండీ యింకా వినిపించుకునేది? ప్రేమ, దోమ అంటూ ఎవరో పనికి మాలిన వాడిని ప్రేమించానని అంటే దానికి తాళం వేస్తూ వంత పాడ మంటారా?" కోపాన్ని నాపైన క్రుమ్మరించింది.

నేను గతుక్కు మన్నాను. సుమతి యిలా నాపైన విరుచుకు పడుతుందని నేను వూహించ లేదు.

"అక్కా! నువ్వే యిలా మాట్లాడటం నాకు ఆశ్చర్యంగా వుంది. నువ్వూ బావ గారిని ప్రేమించి పెళ్లి చేసుకున్నావన్న సంగతి అప్పుడే మర్చి పోయావా?" అంటూ ప్రశ్నించింది శశిరేఖ. మంచి పాయింటే దొరికింది శశిరేఖకి అనుకున్నాను. ఈ ప్రశ్నకు సమాధానం చెప్పలేక సుమతి తెల్ల ముఖం వేస్తుందని వూహించాను. అయితే నేననుకున్నట్లు ఎంత మాత్రం జరగలేదు.

"ప్రేమించానే! ప్రేమించే పెళ్లి చేసుకున్నాను. అయితే నీ లాగ ఎవరో తల మాసిన వాడిని, కులం తక్కువ వాడిని కాదు. మా ప్రేమ సంగతి తెలుసుకున్న అమ్మా, నాన్న ఎంతో సంతోష పడ్డారో నీకు తెలీదూ? వీళ్ల యింటి కెళ్లి పెద్దవాళ్లతో మాట్లాడి అన్ని సక్రమంగా జరిపించారు. కానీ యిప్పుడు నీ పెళ్లి కి ఒప్పుకోక పోవడానికి వాళ్ల కారణాలు సమంజసమైనవే! నోర్మూసుకొని అమ్మా నాన్న తెచ్చిన సంబంధం చేసుకో!" అన్నది సుమతి చివరి మాటగా.

సుమతితోమాట్లాడి ప్రయోజనం లేదనుకుందో ఏమో, శశిరేఖ నా వైపు తిరిగింది.

"నువ్వేం మాట్లాడవేంబావా?" అన్నది.

"మీ అక్క లాగ నిర్దయంగా, ఖచ్చితంగా ప్రేమించిన వాడిని మర్చిపోయి వేరెరినో చేసుకోమని సలహా అయితే యివ్వను గాని, అన్నీ ఆలోచించి సరైన నిర్ణయం తీసుకోమంటాను. చదువూ, వుద్యోగం, ఆలోచనా శక్తి అన్నీ వున్న యువతివి నువ్వు. నీ భవిష్యత్తును నిర్ణయించుకునే అధికారం ఎప్పుడూ నీదే! అన్నాను.

నా మాటలతో శశిరేఖ ముఖం ఆనందంతో విప్పారింది. సుమతి నన్ను మింగేలా చూస్తూ లోనికెళ్లింది. ఆ రోజు నుంచీ సుమతి నన్నో విరోధిలా చూస్తున్నది. ఎంతో అవసరమైతే తప్ప నాతో మాట్లాడటం లేదు. రెండు రోజుల తర్వాత శశిరేఖ వూరెళ్లటానికి సిద్ధపడి మా దగ్గర కొచ్చింది.

"ప్రేమించి పెళ్లి చేసుకున్న దంతపులు కాబట్టి మీ అండ, ఆశీర్వాదం నాకు వుంటాయని ఎంతో ఆశతో వచ్చాను యిక్కడికి. అయితే అక్క ఏమాత్రం అర్థం చేసుకోపోగా, బావ మాత్రం అంటీ అంటనట్లు వుండి పోయారు" అంటూ మనసు కష్ట పెట్టుకొని వెళ్లి పోయింది.

ఆ తర్వాత నా మీద సుమతి దాడి ప్రారంభమయింది.

"దానికి బుద్ధి చెప్పవలసింది పోయి సమర్థిస్తూ మాట్లాడుతారా?" అంటూ కన్నీర జేసింది.

"బుద్ధి చెప్ప వలసినంత తప్పేమీ చెయ్యలేదు కదే! మనసుకు నచ్చిన వాడిని ప్రేమించింది. అయినా నువ్వనుకున్నట్లు అతనేమీ అనామకుడు, అయోగ్యుడు కాదే! ఎంచక్కా బ్యాంకి ఉద్యోగం చేస్తున్నాడు కదా!" అన్నాను సర్ది చెపుతూ.

కాని సుమతి సమాధాన పడలేదు. చిర్రుబుర్రు లాడుతూనే వుంది.

"మా అందరి యిష్టాన్ని కాదని తనిష్ట ప్రకారం వాడినే చేసుకుంటే దానికి జన్మలో మా ముఖం చూసే అదృష్టం వుండదు" అంటున్న సుమతి నా కళ్లకు కొత్తగా కనిపించ సాగింది.

"సుమతీ! మనిద్దరం కూడా ప్రేమించు పెళ్లి చేసుకున్నాం. ఇప్పుడు నీ చెల్లెలు కూడా ఎవరినో ప్రేమించిందంటే హర్షించి ఆశీర్వదించాలి కాని యిలా శాపనార్థాలు పెట్టడం సమం జసమా చెప్పు!" అనునయంగా అడిగాను.

"దానిలాగ కులం గోత్రం లేని వాడిని, అంతస్తు లేని వాడిని ప్రేమించ లేదు. ఆ సంగతి గుర్తుంచుకోండి" ఢీమాగా పలికింది సుమతి.

నాకు ఆశ్చర్యం వేసింది.

ప్రేమించుకునే వాళ్లు కులం, గోత్రం, ఆస్తి అంతస్తు అన్నీ చూసి ప్రేమించుకుంటారా? ప్రేభావన ఎప్పుడు, ఎవరి మీద కలుగుతుందో, ఎవరిని చూసి హృదయం ఎప్పుడు స్పందిస్తుందో ఎవరు చెప్పగలరు?

సుమతి నేను ఒకే కులానికి చెందిన వాళ్లం కావటం కాకతాళీయం. అంతస్తుల్లో కూడా యిద్దరూ సమానమే! ఆ కారణం గానే ఎటువైపు నుంచి కూడా ఎలాంటి అభ్యంతరాలు ఎదురు కాలేదు.

చివరిగా సుమతి తెగేసి చెప్పింది నాతో!

"మీరొక సారి హైదరాబాద్ వెళ్లి మా నాన్న గారితో మాట్లాడి రండి. దగ్గరుండి ఏదో సంబంధం సెటిల్ చేసిరండి."

అలాగేనన్నట్లు తలూపాను. సుమతితో ఎక్కువ గొడవ పడటం నా కిష్టం లేదు.

వారం రోజుల తర్వాత హైదరాబాద్ వెళ్లాను. శశిరేఖ తండ్రి కూడా చాలా పటుత్వంతో వున్నాడు. ఎలాగైనా వీలైనంత త్వరలో కూతురి పెళ్లి చేయాలనే ప్రయత్నా లలో వున్నాడు.

"శశిరేఖా! అందరి మనుతులు నొప్పించి నువ్వీ పెళ్లి చేసుకొని సుఖపడగలవనే తిమకుంటున్నావా?" ఒంటరిగా ఒకసారి అడిగాను శశిరేఖను.

"బాబా! దివాకర్‌ని ఎంత గాఢంగా ప్రేమిస్తున్నానో మాటాలతో చెప్ప లేదు. అతనూ అంతే! నా కోసం ప్రాణాలు అర్పిస్తాడు. మేం పెళ్లి చేసుకోవాలని ఆశించడం తప్పంటావా?" దీనంగా అడుగుతున్నశశిరేఖ ముఖంలో నాలో ఆలోచనలు రేకెత్తించింది.

హైదరాబాద్ నుంచి తిరిగొచ్చిన నెల రోజుల తర్వాత మామగారి దగ్గరి నుండి వుత్తరం వచ్చింది. శశిరేఖకు ఒక సంబంధం మాట్లాడామని, ఫలానా రోజు పెళ్లి చూపులు ఏర్పాటు చేశామని, ఆ రోజుకి తప్పక రావల్సిందనీ వ్రాశారు.

పెళ్లి చూపుల ముందురోజుకి హైదరాబాద్ చేరుకున్నాం నేను, సుమతి!

ఉదయం బ్యాంకి కని చెప్పి బయలుదేరి వెళ్లిన శశిరేఖ సాయంత్రం వచ్చేటప్పుడు ఒక యువకుడిని వెంట బెట్టుకొని వచ్చింది. అతనే దివాకర్ అని వూహించారు యింట్లో అందరూ!

"నన్ను క్షమించండి నాన్నగారూ! ఈ రోజే దివాకర్, నేను రిజిస్టర్ మేరేజ్ చేసుకున్నాం." అంటున్న శశిరేఖ వైపు నివ్వెర పోతూ చూశారు సుమతి, ఆమె తల్లి దండ్రులు!

ఆ తర్వాత చాలా రొద్దాంతం జరిగింది యింట్లో!

శశిరేఖ, దివాకర్ చాలా కామ్‌గా వెళ్లి పోయారు యింట్లో నుంచి.

రెండు రోజులుండి నేను, సుమతి తిరిగి వచ్చేశారు!

మరుసటి రోజు ఆఫీసుకి వెళ్లగా నా టేబుల్ మీద వుత్తరం కనిపించింది. శశిరేఖ దగ్గర నుండి అని సులభంగానే గ్రహించాను.

"బావా! నీకు ఎలా కృతజ్ఞతలు చెప్పకోవాలో తెలీటం లేదు. నువ్విచ్చిన ధైర్యంతో, ప్రోత్సహంతో నా మనసుకి నచ్చిన వ్యక్తిని చేపట్టగలిగాను. నువ్వు హైదరాబాద్ వచ్చినప్పుడు నాలో ధైర్యం రేకెత్తించి దగ్గరుండి రిజిస్ట్రారుఆఫీసుకి తీసుకెళ్లి ఫారాలు పూర్తి చేయించి మా సమస్యను యింత సులభంగా పరిష్కరించిన నీ మంచి మనసుకు జోహార్లు!"

నవ్వుకుంటూ ఉత్తరం చించి ముక్కలు చేశాను.

ప్రేమంటే నాకు చాలా గౌరవం! ప్రేమ కలకాలం వర్ధిల్లాలనేదే నా ఆశ, ఆశయం!